

ఎంఇఒకి సమ్మె నోటీసు అందజేత



ప్రజాశక్తి -గోకవరం


జెఎసి పిలుపు మేరకు సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 20న సమ్మెకు వెళ్తున్నట్లు సమగ్ర శిక్ష ఉద్యోగులు ఎంఇఒ బి.గౌరమ్మకి శుక్రవారం సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు మాట్లాడారు. 3 నెలల నుంచి జీతాలు సకాలంలో వేయట్లేదన్నారు. ఇప్పటివరకు కనీసం జీతాలు కూడా పెంచలేదన్నారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే రెగ్యులర్ చేస్తానని, సమాన పనికి సమాన వేతనం ఇస్తామని గతంలో పాదయాత్ర సమయంలో జగన్ చెప్పారన్నారు. కాని ఆ హామీ నేటికీ నెరవేరలేదన్నారు. ఈ కార్యక్రమంలో జెఎసి మండల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

ఆధార్ ప్రామాణికం కాదు

- పుట్టిన తేదీపై యుఐఎఐ ప్రకటన
- సంక్షేమ పథకాలపై ప్రభావం?
- లబ్ధిదారుల్లో ఆందోళన

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం ప్రతినిధి

'ఆధార్‌లోని పుట్టిన తేదీ చెల్లదు' అంటూ ఆధార్ సంస్థ కొత్త కార్డులు జారీ చేయడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల పరిధిలో కొన్ని పథకాల ధ్రువీకరణకు వీలుగా ఆధార్‌లో నమోదైన పుట్టిన తేదీని ప్రామాణికంగా తీసుకుంటూ వచ్చారు. ఇదివరకు యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా పుట్టినతేదీపై తీసుకున్న నిర్ణయంపై పలు రకాల వార్తలు వినిపిస్తున్నాయి. వృద్ధాప్య పింఛన్‌కైనా, వితంతువులకు ఆర్థిక సాయం చేయడానికైనా, చంటి పిల్లలను హాస్టల్ చేర్పించినా ఈ కార్డే ఆధారం. ఆధార్‌తోనే మిగతా కార్డులన్నీ, అకౌంట్లన్నీ లింక్ అవుతూ వచ్చాయి. వాస్తవానికి ఆధార్‌లో నమోదైన పుట్టిన తేదీకి సంబంధించి ఇంతకు ముందే కొంత గందరగోళం ఉంది. అయినా కూడా పుట్టిన తేదీ సక్రమమే అని ఆధార్‌లో గుర్తించడానికి గెజిటెడ్ ధ్రువీకరణను ప్రామాణికంగా తీసుకునేవారు. లేకుంటే నోటరీ పద్ధతిలో కొందరు ధ్రువీకరణకు ప్రయత్నించేవారు. కాని ఆకస్మికంగా ఆధార్‌లో నమోదైన పుట్టిన తేదీ ఇక చెల్లదన్నట్టుగా తీసుకున్న నిర్ణయం ఇప్పుడు గుబులు రేపుతోంది. ఇక ముందు ఆధార్ అనేది 'గుర్తింపు రుజువు' మాత్రమే. 'పౌరసత్వం, పుట్టిన తేదీకి కానేకాదు' అంటూ తాజాగా జారీ చేస్తున్న ఆధార్ కార్డులపై ముద్రించడం విశేషం. కొన్నేళ్ళ క్రితం వరకు ఆధార్‌లో సన్ ఆఫ్, డాటర్ఆఫ్, వైఫ్ ఆఫ్ అనే బంధుత్వం కూడా ఉండేది. రెండేళ్ల క్రితమే ఈ పదాలన్నింటినీ తొలగించి అప్పటి నుంచి కేరాఫ్ అంటూ ప్రచురిస్తు న్నారు. సంక్షేమ పథకాలకు సంబంధించి ప్రభుత్వాలు ఆధార్‌కార్డులను ప్రామాణికంగా తీసుకుంటున్నాయి. ఉదాహరణకు 45 ఏళ్లు దాటితేనే మహిళలకు చేయూత కింద రుణం, 35 ఏళ్లు నిండిన ఒంటరి మహిళలకు ఆర్థిక చేయూత, 60 ఏళ్లు దాటితే వృద్ధాప్య పింఛన్, 60 ఏళ్లు దాటిన వారికి బీమా సౌకర్యం కల్పిస్తూ వస్తున్నారు. వీటన్నింటిలో పుట్టిన తేదీని ఆయా వ్యక్తుల ఆధార్ కార్డుల్లో నమోదైన తేదీనే పరిగణనలోకి తీసుకుంటున్నారు.



ఆధార్‌లో పుట్టిన రోజు ప్రామాణికం కాదంటూ వచ్చిన కొత్త కార్డు

గిరిజన తెగలకు చెందిన వ్యక్తులకు వృద్ధాప్య పింఛన్ అందించాలంటే 50 ఏళ్లు నిండితే చాలు. ఇక్కడ కూడా ఆధారే ఆధారం. ఇలాంటి కీలక నిర్ణయాలు, పేద వర్గాలకు చెందిన లబ్ధిదారుల ఎంపికలో ఓ గుర్తింపుగా ఉన్న పుట్టిన తేదీకి తాజాగా చెక్ పెట్టడం విస్మయానికి గురి చేస్తోంది. అప్పటికప్పుడు నిర్ణయం తీసుకోవడమే కాకుండా తక్షణం అమలులో పెట్టారు. ఇప్పుడు తాజాగా నమోదవుతున్న ఆధార్ కార్డులన్నింటిలోనూ ఈ విషయం ప్రచురించి జారీ చేస్తున్నారు. ఇంకోవైపు ఏ ఏడాదికాయేడాది సర్కార్ ప్రవేశపెట్టిన పథకాల కింద లబ్ధిదారుల సంఖ్య పెరుగుతూ వస్తుండగా ఇప్పుడు పుట్టిన తేదీ కూడా ఓ సమస్యగా మారడంతో ఇక ముందది పేదల మెడకు చుట్టుకోబోతుంది. ఈసారి పుట్టిన తేదీ కోసం మళ్లీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి దాపురించే ప్రమాదం ఉంది. ప్రభుత్వం పథకాలకు సంబంధించి దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచిచూడాలి.



యుటిఎఫ్ సీనియర్ నేత బ్రహ్మాజీరావు భౌతికకాయంపై యుటిఎఫ్ జెండాను కప్పి నివాళులర్పిస్తున్న నాయకులు

యుటిఎఫ్ సీనియర్ నాయకులు బ్రహ్మాజీరావు మృతి

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం



యుటిఎఫ్ సీనియర్ నాయకులు కె.బ్రహ్మాజీరావు(80) వయోభారంతో శుక్రవారం రాజమహేంద్రవరంలోని తన సొంతి ఇంట్లో మృతి చెందారు. ఆయన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు యుటిఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షునిగా సేవలందించారు. యుటిఎఫ్ పత్రిక, ఐక్య ఉపాధ్యాయ పత్రికకు సంపాద వర్గంగా పనిచేశారు. ఉపాధ్యాయ ఉద్యమాల్లో చురుకుగా పాల్గొనేవారు. ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికుల సంక్షేమానికి కృషి చేశారు. ఆయన మృతికి యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఎ.షరీఫ్ సంతాపం తెలిపారు. యుటిఎఫ్ నాయకులు బ్రహ్మాజీ రావు భౌతికకాయాన్ని సందర్శించారు. యుటిఎఫ్ పతాకాన్ని కప్పి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని ప్రకటించారు. 25న లింగపేటలోని బ్రహ్మాజీరావు ఇంటి వద్ద సంతాప సభ జరుగుతుందని నాయకులు తెలిపారు. ఈ సంతాప సభకు పిడిఎఫ్ ఎంఎల్‌సిలు హాజరవుతారని తెలిపారు. జిల్లా కార్యదర్శులు, రాష్ట్ర కౌన్సిలర్లు జిల్లా కార్యవర్గ సభ్యులు, ప్రాంతీయ, మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సంక్షేమ పథకం బాధ్యులు, కార్యకర్తలు, నాయకులు ఈ సభకు హాజరుకావాలని కోరారు.

వన్యప్రాణులకు రక్షణ కరువు

అటవీ ప్రాంతాల్లో పెరుగుతున్న జీవాల వేట

ప్రజాశక్తి-గోకవరం

వేటగాళ్లతో వన్యప్రాణులకు రక్షణ కరువైంది. గోకవరం మండలంలో గల తిరుమలాయపాలెం అటవీప్రాంతం, సూదికొండల్లో గల రిజర్వ్ ఫారెస్ట్‌ను ఆనుకుని ఉన్న గోకవరం, గంగవరం, రంపచోడవరం మండలాల్లోని అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణులు అధికంగా సంచరిస్తూ ఉంటాయి. ఈ వన్యప్రాణులను వేటాడడానికి రాజమహేంద్రవరం, జగ్గంపేట, కాకినాడ పట్టణ ప్రాంతాల నుంచి వేటగాళ్లు తరచుగా ఈ ప్రాంతాలకు వస్తున్నారు. రాత్రి సమయంలో వన్యప్రాణులను వేటాడుతున్నారు. గతంలో తిరుమలయపాలెంలో గల అటవీ ప్రాంతంలో చిరుత, సూది కొండ అటవీ ప్రాంతంలో దుప్పిలు, జింకలు, కనుసులు, అడవిపందులు వీరి వేటకు బలవుతున్నాయి. ఇటీవల తిరుమలాయపాలెం అటవీ ప్రాంతంలో రాజమహేంద్రవరం నుంచి వచ్చిన వేటగాళ్లు సంచరిస్తుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ అటవీ శాఖ అధికారులు వారిని పట్టుకున్నారు. వారి నుంచి తుపాకులను సైతం స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. ఈ విషయాన్ని బయటకు రానీయకుండా అటవీ శాఖ అధికారులు ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. అటవీశాఖ అధికారులకు చిక్కిన వేటగాళ్లలో రాజమహేంద్రవరానికి చెందిన ఒక ప్రయివేటు డాక్టర్, అతని ఇద్దరు స్నేహితులు ఉన్నట్లు సమాచారం. వేటగాళ్లను విడిపించడానికి అధికార పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు ప్రయత్నిస్తున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి అటవీశాఖ అధికారులు ఒత్తిళ్లకు లొంగితే భవిష్యత్తులో ఈ అటవీ ప్రాంతంలో వన్యప్రాణులు కనుమరుగవుతాయని స్థానికులు అంటున్నారు.



అటవీప్రాంతంలో తిరుగుతున్న జింకలు

480 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - గోకవరం

మండలంలోని కొత్తపల్లి ఆదర్శ ఫార్మసీ కళాశాల విద్యార్థుల తల్లిదండ్రులు సుమారు 480 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించామని కళాశాల చైర్మన్ ప్రగళ్లపాటి కనకరాజు తెలిపారు. శుక్రవారం కొత్తపల్లి ఆదర్శ ఫార్మసీ కళాశాలలో జాతీయ ఫార్మసీ వారోత్సవాలు పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్యఅతిథిగా కళాశాల చైర్మన్ కనకరాజు పాల్గొని శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. డాక్టర్ గణేష్ హరినాథ్ బాబా, డాక్టర్ హర్షిత పర్యవేక్షణలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ డాక్టర్ నాగమణి, ప్రిన్సిపల్ డాక్టర్ త్రినాథ్‌రావు, కళాశాల డైరెక్టర్ డాక్టర్ హారిక, కళాశాల కో-ఆర్డినేటర్ పి.శ్రీనివాస్, అధ్యాపకులు కామేష్, ప్రేమ్, కుందన రాజు, పద్మ, వలస రెడ్డి, భార్గవి, దీప్తి, దీపిక పాల్గొన్నారు.

న్యాయం చేసే వరకూ పోరాటం

ప్రజాశక్తి-దేవరపల్లి

శీల బోయిన రమాదేవి కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.పోచమ్మ అన్నారు. దేవరపల్లిలోని స్థానిక ఆసుపత్రి వద్ద జరుగుతున్న నిరవధిక సమ్మె శుక్రవారం నాటికి 4వ రోజుకు చేరుకుంది. ఆసుపత్రి నుంచి దేవరపల్లి లోని గోపాలపురం రోడ్డు వరకు ఆశాలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం చేపట్టారు. రమాదేవి మృతి సందర్భంగా ఆమె కుటుంబానికి న్యాయం చేస్తామని అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదన్నారు రమాదేవి కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు ఈ పోరాటాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తావని తెలిపారు తప్పుడు నివాస ధ్రువపత్రాలు ఇస్తున్న రెవెన్యూ, పంచాయతీ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిఐటియు మండల నాయకులు కె.రత్నాజీ మాట్లాడుతూ రమాదేవి కుటుంబం పట్ల అధికారులు ప్రజా ప్రతినిధుల వైఖరి దుర్మార్గమన్నారు. తక్షణమే రమాదేవి కుటుంబాన్ని ఆదుకోవాలఅన్నారు. వీరికి తాళ్లపూడి, మలగపల్లి పిహెచ్‌సి ఆశాల మద్దతు తెలిపారు. యూనియన్ జిల్లా నాయకులు ఎం.బేబిరాణి, ఆశా వర్కర్లు మడతల రాణి, జి.లక్ష్మి, ఐ.రామలక్ష్మి, కె.సత్యతులసి, తుర్లపాటి ఇందిరా పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఆశావర్కర్లు



వృద్ధురాలిని పలుకరిస్తున్న మంత్రి వనిత

చాగల్లులో గడప గడపకూ...

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు ఇందిరమ్మకాలనీలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం హోం మంత్రి డాక్టర్ తానేటి వనిత నిర్వహించారు. సచివాలయం - 4 పరిధిలోని ఇంటింటా ఆమె పర్యటించారు. ప్రభుత్వ పథకాలను వివరించారు. వాటి అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. నాలుగన్నరేళ్ల పాలనలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులను సమస్యల పరిష్కారం కోసం ఆదేశించారు. ఇందిరమ్మ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆమె పరిశీలించారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. గోరుముద్ద పథకం అమలుపై ఆరా తీశారు. ఆమె మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కానన్ని సంక్షేమ పథకాలు ఆంధ్రప్రదేశ్‌లోని వైసిపి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. విద్యార్థులను గ్లోబల్ సిటిజెన్స్‌గా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, ఉప సర్పంచ్ మేకరాజు గంగ్రోతు సురేంద్ర కుమార్, సిహెచ్.దుర్గా మల్లేశ్వరరావు, జె.ఏడుకొండలు, ఎంపిడిఒ బి.రాంప్రసాద్, తహశీల్దార్ కె.రాజ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ఎల్.రవికుమార్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి - రాజానగరం

మహిళలు ఆరోగ్యంపై దృష్టి సారించాలని, మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుందని నన్నయ యూనివర్శిటీ విసి కె.పద్మరాజు అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఉమెన్ ఎంపవర్‌మెంట్ డెవలప్‌మెంట్ అండ్ గ్రీవెన్స్ సెల్ ఆధ్వర్యంలో ఉమెన్ హెల్త్ అండ్ హైజీన్ అనే అంశంపై అవగాహనా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విసి పద్మరాజు, రాజమహేంద్రవరం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎన్‌సి.హేమనళిని హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విసి మాట్లాడారు. గోదావరి జిల్లా ఉన్నత విద్యాకేంద్రమైన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఎక్కువ మంది మహిళ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడం చాలా ఆనందంగా ఉందన్నారు. అన్ని రంగాల్లో మహిళలు ఉన్నత స్థానాల్లో ఉన్నారని, విశ్వవిద్యాలయ విద్యార్థులు పట్టుదలతో సాధన చేస్తే ఉన్నత స్థానాలకు చేరుకుంటారన్నారు. తల్లి ఆరోగ్యంగా ఉంటే సమాజం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. హేమనళిని మాట్లాడుతూ ఆహారపు అలవాట్లలో మార్పుల వల్ల మహిళలు అనారోగ్యాలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. మహిళలు శారీరక, మానసిక ఆరోగ్యాలపై దృష్టిని సారించాలన్నారు. ఇటీవల కాలంలో మహిళలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలు, వాటి పరిష్కారాలను తెలిపారు. ఉమెన్ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.ఉమమహేశ్వరి మాట్లాడుతూ వినయ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు 2 నెలల టైలరింగ్ సర్టిఫికెట్ కోర్సును యూనివర్సిటీలో అందిస్తున్నామన్నారు. విశ్వవిద్యాలయ మహిళ సిబ్బంది, మహిళ విద్యార్థులు ఈ ప్రోగ్రామ్‌కు అర్హులన్నారు. అనంతరం డాక్టర్ ఎన్‌సి.హేమనళిని, విసి పద్మరాజును సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య పి.సురేష్ వర్మ, ప్రిన్సిపల్స్ డి.జ్యోతిర్మయి, డాక్టర్ పి.విజయనిర్మల, వినయ సుంకర ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ సుంకర వెంకటేశ్వరరావు, విశ్వవిద్యాలయ అధికారులు అధ్యాపకులు పాల్గొన్నారు.



డాక్టర్ .హేమనళిని సత్కరిస్తున్న విసి పద్మరాజు

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


ప్రజాశక్తి - గోపాలపురం

రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వం ధ్యేయమని ఎంఎల్ఎ తలారి వెంకట్రావు అన్నారు. శుక్రవారం మార్కెట్ యార్డ్ సమావేశం మందిరంలో ఎఒ రాజారావు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు జుజ్జవరపు అన్నవరం ఆధ్వర్యంలో సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంఎల్ఎ పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి రైతుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందన్నారు. ఎప్పటికప్పుడు నగదును కూడా వారి ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. రైతులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దళారులకు అమ్ముకోకుండా ఆర్‌బికెల్లోనే విక్రయించాలన్నారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో అపరాలను సాగు చేయాలన్నారు. ప్రస్తుతం అపరాలకు మంచి గిట్టుబాటు ధర ఉందని మండల వ్యవసాయధికారి బి.రాజారావు కోరారు. పిఆర్ 126, ఎస్ఎల్10 సాగు చేస్తే ధాన్యాన్ని కొనే అవకాశం దన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ, జడ్‌పిటిసి సభ్యులు కె.లలిత, సొసైటీ అధ్యక్షులు కూసం రామ్మోహన్‌రెడ్డి, ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి, తహశీల్దార్ బి.రవీంద్రనాథ్, వ్యవసాయ శాఖ సలహా మండల సభ్యులు, గ్రామ వ్యవసాయ ఉద్యాన సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు మారినా అవే బోర్డులు...

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ప్రజలకు తెలియాల్సిన సమాచార పట్టికల్లో సమాచారం అసమగ్రంగా ఉండటంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. ఉండ్రాజవరం మండలం 2014లో తూర్పుగోదావరి జిల్లాలో విలీనమయ్యాయి. అయినా నేటికీ వివిధ సచివాలయాలపై పశ్చిమగోదావరి జిల్లా బోర్డులే కనిపిస్తున్నాయి. మండల స్థాయి అధికారులు అనేకమంది బదిలీపై వివిధ ప్రాంతాలకు వెళ్లిపోయినప్పటికీ ఇప్పటికీ సమచార బోర్డులో వారి పేర్లే కనిపిస్తున్నాయి. ఉండ్రాజవరం ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డి, తాడిపర్రు కార్యదర్శులు బదిలీ అయ్యారు. అయినా తాడిపర్రు కార్యాలయంలో బదిలీ అయిన అధికారుల పేర్లే దర్శనమిస్తున్నాయి. ఒక్కో సచివాలయంలో పదుల సంఖ్యలో ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నప్పటికీ, ప్రజలకు తెలియాల్సిన సమాచారం పట్ల నిర్లక్ష్యం వహించడంతో సచివాలయాల ఉద్యోగుల కార్యకలాపాలు ఏంటో అర్థం కావట్లేదని పలువురు వాపోతున్నారు.



కులగణన సర్వేపై అవగాహన

ప్రజాశక్తి - కడియం

డిసెంబర్ 10 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న కుల గణన సర్వేపై వాలంటీర్లు, ఎన్యూమరేటర్లు, సూపర్ వైజర్లకు కడియం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ కె.రత్నకుమారి ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ సర్వేను సక్రమంగా నిర్వహించేందుకు అవసరమైన శిక్షణ ఇచ్చామన్నారు. పలు సూచనలు, సలహాలు ఇస్తూ అవగాహన కల్పించామన్నారు. వాలంటీర్లు, సెక్రటరియేట్ ఉద్యోగులు, మండల స్థాయి అధికారులు, వాలంటీర్ అప్లికేషన్ ద్వారా కుల గణన సర్వే నిర్వహించనున్నారని తెలిపారు.

ఘనంగా అన్నసమారాధనలు

ప్రజాశక్తి-గోకవరం, చాగల్లు

మండలంలోని వీరలంకపల్లిలో శుక్రవారం దంగేటి వెంకటరత్నం కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు. స్థానికులతో పాటూ పెంటపల్లి, రంప ఎర్రంపాలెం, గోకవరం, అచ్యుతాపురం, బాబాజీ పేట, వెదురుపాక, గుమ్మళ్ళదొడ్డి గ్రామాల నుంచి ప్రజలు దీనికి హాజరయ్యారు. వెంకటరత్నం కుటుంబ సభ్యులు మాట్లాడుతూ 1956లో వీరలంకపల్లి గ్రామంలో వెంకటరత్నం ఈ సత్రం నిర్మించారన్నారు. అప్పటి నుంచి ప్రతి ఏటా కార్తీక మాసంలో అన్న సమరాధన నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దంగేటి వెంకటరత్నం కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. చాగల్లు మండలంలో కార్తీక ఏకాదశి ముగింపు సందర్భంగా శుక్రవారం నేలటూరులో కోడూరి వారి రామాలయంవద్ద చాగల్లు మెయిన్ బజార్‌లో ఉన్న షిరిడీ సాయిబాబా ఆలయ వద్ద చాగల్లు శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన నిర్వహించారు. చుట్టుపక్క గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

పైపులైన్ పనుల పరిశీలన

ప్రజాశక్తి-గోకవరం

పంచాయతీ కార్యాలయం ముందు నిర్మిస్తున్న పైపులైను పనులను సర్పంచ్ కొమరం శ్రావణి శుక్రవారం పరిశీలించారు. తొలుత ఆమె పాలకవర్గ సమావేశంలో పాల్గొన్నారు. గ్రామంలో కోతుల బెడదను తరలించడానికి అటవీ శాఖ అధికారుల సాయం కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు తుమ్మల శివాజీ, పులపర్తి సురేఖ, బొడ్డపాటి వీరచంద్రం, ఎంపిటిసి మాజీ సభ్యులు పులపర్తి బుజ్జి, పంచాయతీ ఇఒ టి.శ్రీనివాస్, అబ్రహాం పాల్గొన్నారు.

పందలపాకలో బాబు ష్యూరిటీ...

ప్రజాశక్తి - బిక్కవోలు

పందలపాకలో టిడిపి గ్రామ శాఖ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టిడిపి, జనసేన ఉమ్మడిగా పోటీచేసి విజయం సాధిస్తుందన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే ప్రజలకు అందించే పథకాలను వివరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి, టిడిపి బిసి సెల్ అనపర్తి నియోజకవర్గ అధ్యక్షుడు కర్రి శ్రీనివాసరావు, అంగన్‌వాడీ, డ్వాక్రా సాధికార కమిటీ అధికార ప్రతినిధి సత్యగౌరి, అనపర్తి నియోజకవర్గ తెలుగు మహిళ కార్యనిర్వాహక కార్యదర్శి చినమ్మ, తూర్పుగోదావరి జిల్లా తెలుగు రైతు కార్యదర్శి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు హెల్త్ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి - పెరవలి


మండలంలోని అజ్జరం గ్రామంలో రైతు భరోసా కేంద్రం వద్ద పాడి రైతులకు యానిమల్ హెల్త్ కార్డులను పంపిణీ చేసినట్టు మండల పశు వైద్యాధికారి వానపల్లి చరణ్‌ఫణీంద్ర తెలిపారు. పాడి రైతులందరూ వీటిని తీసుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గారపాటి నాగసుధాభూషణం, వెంకటరాయపురం సర్పంచ్ బాలాజీ, రైతు భరోసా చైర్మన్లు ఏడుకొండలు, వైసిపి గ్రామ అధ్యక్షుడు నాగిరెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ సాయి, పాడి రైతులు పాల్గొన్నారు.

యువగళం యాత్రపై సమావేశం

ప్రజాశక్తి - పెరవలి

యువగళం యాత్రపై పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో శుక్రవారం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల టిడిపి నాయకులు సమావేశమయ్యారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల టిడిపి జోన్ -2 ఇన్ ఛార్జ్ ప్రత్తిపాటి పుల్లారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఆ పార్టీ నిడదవోలు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు పాల్గొన్నారు. యువగళం, తదితర అశాలపై చర్చించినట్టు ఆయన తెలిపారు.

కార్టూ'నిజం'



నన్నయను సందర్శించిన సెంచూరియన్ విసి

ప్రజాశక్తి - రాజానగరం

ఆదికవి నన్నయ యూనివర్సిటీని సెంచూరి యన్ యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ జిఎస్ఎన్.రాజు శుక్రవారం సందర్శించారు. నన్నయ యూనివర్సిటీలో విసి కె.పద్మరాజు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. విసి కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా నన్నయ విసి పద్మరాజు మాట్లాడుతూ తన గురువు సెంచూరియన్ యూనివర్సిటీ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్.రాజును కలవడం చాలా ఆనందంగా ఉందన్నారు. జిఎస్ఎన్.రాజు విద్యతో పాటు క్రీడల్లోనూ అగ్రస్థానంలో ఉంటూ తన వంటి వారికి మార్గదర్శకులుగా నిలిచారన్నారు. ఎయు నుంచి ఫస్ట్ ర్యాంక్‌తో బిఇ, ఎంఇ ఫస్ట్ క్లాస్ డిస్టింక్షన్ సాధించారన్నారు. వెయిట్ లిఫ్టింగ్ లో ఆంధ్రా యూనివర్సిటీ తరుపున ప్రాతినిథ్యం వహించారనానరు. పరుగుపందెంలో ఆంధ్రా యూనివర్సిటీ గోల్డ్ మెడలిస్ట్‌గా, బాక్సర్ గా, షార్ట్‌పుట్‌లో గోల్డ్ మెడలిస్ట్‌గా క్రీడల్లోను తనదైన ముద్రవేసుకున్నారని గుర్తుచేశారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ నిర్వహిస్తున్న సౌత్, వెస్ట్ జోన్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరు కావాలని ఆయన్ని విసి కోరారు. దీనిపై స్పందించిన ప్రొఫెసర్ జిఎస్ఎన్.రాజు మాట్లాడుతూ తనకు ఎంతో ఇష్టమైన విద్యార్థి కె.పద్మరాజు ఎంతో పట్టుదలతో విద్యావేత్తగా ఎదిగి నేడు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతిగా సేవలందించడం హర్షణీయమన్నారు. విద్యార్థుల ఉన్నతిని గురువులు నిత్యం ఆకాంకిస్తారని, ఆనందిస్తారని తెలిపారు. సౌత్, వెస్ట్ జోన్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలకు హాజరవుతానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, విశ్వవిద్యాలయ అధికారులు పాల్గొన్నారు.



జిఎస్ఎస్.రాజును సత్కరిస్తున్న విసి పద్మరాజు

ఎసైన్డ్ భూములకు పట్టాల పంపిణీ

ప్రజాశక్తి - గోపాలపురం

ఎసైన్డ్ భూములకు సంబంధించిన పట్టాలను ఎంఎల్ఎ తలారి వెంకట్రావు లబ్ధిదారులకు శుక్రవారం పంపిణీ చేశారు. గోపాలపురం ఎఎంసి కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎటువంటి పత్రాలు లేకుండా భూములను సాగు చేసుకుంటున్న సన్న, చిన్న కారు రైతులకు పట్టాలు అందించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అస్సైన్ మెంట్ -2023 సంబంధించి జిల్లా అస్సైన్ మెంట్ కమిటీ ఆమెదించిన 373 మంది లబ్ధిదారులకు పట్టాలను అందజేశారు. వెంకటాయిపాలెంలో రీ- సర్వే జరిగినందున భూ హక్కు పత్రాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసిల అభ్యున్నతికి ముఖ్యమంత్రి ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. పట్టాలు పొందిన వారు బ్యాంకుల ద్వారా రుణాలు పొందొచ్చన్నారు. వీరికి కూడా రైతు భరోసా వర్తిస్తుందన్నారు. కులమతాలకతీతంగా రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిసుందన్నారు. గోపాలపురం-దొండపూడి రోడ్డును త్వరలోనే నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, జడ్‌పిటిసి సభ్యులు కె.లలిత, ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి, తహశీల్దార్ బి.రవీంద్రనాథ్, ఎస్‌కె ఖాదర్‌వలీ, సర్పంచులు అన్సర్ భాషా, ఇళ్ల శ్రీరామమూర్తి, గోళ్ల దండియ్య, ఎంపిటిసి సభ్యులు సనమండ్ర లాజరు, జుజ్జవరపు అన్నవరం, డిటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండల పరిధిలోని జి.వేమవరం పంచాయతీ రామాలయంపేటకు చెందిన ఎర్రమనీడి వెంకటరమణ (51) శుక్రవారం విద్యుదాఘాతంతో మృతి చెందారు. కోరంగి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఇంటి పెరట్లో ఉన్న విద్యుత్ మోటార్‌ను ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ కొట్టి వెంకటరమణ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎస్.రవికుమార్ తెలిపారు.



ప్రమాదంలో ధ్వంసమైన ఆటో

కారు ఆటో ఢీకొని ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని కోరంగి వద్ద జాతీయ రహదారి 216పై శుక్ర వారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. కోరంగి పోలీసులు తెలిపిన వివరాల మేరకు కాకినాడ నుంచి వస్తున్న కారు యానాం వైపు నుంచి ప్రయాణికులతో వెళుతున్న ఆటో ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న పెదబొడ్డు వెంకటాయపాలెం పాఠశాల హెచ్ఎం నడింపల్లి వెంకటరాజు కారులో బెలూన్‌లు ఓపెన్ కావడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఆటోలో ఉన్న ఆరుగురు ప్రయాణికుల్లో యానాంకు చెందిన ఆటో డ్రైవర్ సంగాడి వెంకట నరసింహ స్వామి, కోరంగి ఫార్మసీ కళాశాల విద్యార్థి పోతనపల్లి మోహిత్, యానాంకు చెందిన ప్యాసింజర్ పెసింగి జగ్గారావు, తెనాలి కూచిపూడి గ్రామానికి చెందిన దేవరకొండ రాజేష్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. ఇదే గ్రామానికి చెందిన పెమ్మాడి రానివాస్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. ఈ ప్రమాదంలో ఆటో పూర్తిగా ధ్వంసం కాగా కారు ముందు భాగం నుజ్జు నుజ్జు అయింది. కోరంగి ఎస్ఐ రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలపై విశ్రాంత ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి-కాకినాడ

రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని అసోసియేషన్ నాయకులు కె.పద్మనాభం, ఎస్.ఇబ్రహీం, హెచ్‌సి.సుబ్రహ్మణ్యం, శాస్త్రి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కాకినాడ సిటీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డికి వారు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించాలని సిఎంకి సిఫార్సు చేయాలని, ప్రతినెలా 1నపింఛను చెల్లించాలని, తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమం కోసం కృషి

ప్రజాశక్తి- పెద్దాపురం

రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్యవైశ్య సేవా సంఘ భవనంలో తహశీల్దారు జితేంద్ర అధ్యక్షతన నిర్వహించిన సభలో సుమారు 300 మందికి భూ బదలాయింపు హక్కు పత్రాలు ఆయన పంపిణీ చేశారు. ఆర్‌డిఒ జె.సీతారామారావు మాట్లాడుతూ అర్హులందరికీ ఈ పట్టాల పంపిణీ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బొడ్డు తులసి మంగతాయారు, జెడ్‌పిటిసి గవరసాన సూరిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల పట్ల మానవత్వంతో మెలగాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

వృద్ధుల పట్ల ప్రతి ఒక్కరూ మానవత్వంతో మెలగాలని సీనియర్ సిటిజన్స్ ఇన్విజిలేటర్ పి.శ్యామ్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక తహశీల్దారు కార్యాలయ ఆవరణలోని స్త్రీ శక్తి భవనంలో సీనియర్ సిటిజన్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు భళ్లమూడి సూర్యనారాయణ మూర్తి అధ్యక్షతన 'వృద్ధుల పోషణ, రక్షణ, సంక్షేమ చట్టం'పై జరిగిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎపిఎం పి.సూర్యనారాయణ, పి.సుధాకర్, టి.సత్యనారాయణ, వి.శ్యామల, బి.కృష్ణ, జామి అప్పారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన ఆహారం అందించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ హైస్కూల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నం భోజనం నాణ్యతను మరింత పెంచాలని ఎస్ఎఫ్ఐ విజ్ఞప్తి చేసింది. శుక్రవారం ఎస్ఎఫ్ఐ బృందం విద్యార్థులకు అందజేసిన భోజనాన్ని పరిశీలించింది. అనంతరం వారు మాట్లాడుతూ ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా విద్యార్థులకు ఈ భోజనాన్ని సరఫరా చేస్తున్నారన్నారు. భోజనం చాలా నాసిరకంగా ఉందన్నారు. అధికారులు పరిశీలనకు వస్తారని తెలిసిన రెండు రోజులపాటు భోజనం బాగుంటోందని, మిగిలిన రోజుల్లో మామూలేనని వారు తెలిపారు. భోజనం బాగుండకపోవడంతో చాలామంది విద్యార్థులు స్కూల్లో భోజనం చేయడం లేదని ఇళ్లకు వెళ్లిపోతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ హైస్కూల్లో నాణ్యమైన భోజనాన్ని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వై.గోపాల్, బి.జగదీష్, జి.రాజు పాల్గొన్నారు.

పద్మనాభం కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-అమలాపురం(అల్లవరం)

బెండమూర్లంక పాలగుంట చెరువు గ్రామంలో ఎస్‌సి నాయకులు మోకా పద్మనాభం ఇటీవల గుండెపోటుతో మరణించారు. మృతుని కుటుంబాన్ని విజయవాడ సిటీ ఎసిపి మోకా సత్తి బాబు శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా పద్మనాభం చిత్ర పటం వద్ద నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాతి శ్రీనివాసరావు, రేవు సుందర రావు, పల్లి జేమ్స్, తాడి రాజకిరణ్, పరమట నాని, తాడి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పంపా తీరంలో సత్యదేవుని తెప్ప ఉత్సవం

ఘనంగా సత్యదేవుని తెప్పోత్సవం

ప్రజాశక్తి-అన్నవరం

అన్నవరం సత్యదేవుని తెప్ప ఉత్సవం పంపా నదిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ద్వాదశి సందర్భంగా సత్యదేవుని కొండదిగువన పంపా సరోవరం తీరం వద్ద ప్రత్యేక వేదికపై ఉంచారు. ఎంఎల్ఎ పర్వత పూర్ణ చంద్రప్రసాద్, దేవస్థానం ఇఒ రామచంద్రమోహన్, చైర్మన్ రాజా ఐ.వి రోహిత్ సమక్షంలో అర్చకులు, వేద పండితులు పూజలు నిర్వహించారు. అనంతరం హంస వాహనంపై తెప్ప ఉత్సవం నిర్వహించారు.



కాకినాడలో ధర్నా నిర్వహిస్తున్న సిపిఐ నాయకులు

రైతులను ఆదుకోవాలని ధర్నా

ప్రజాశక్తి-కాకినాడ

జగ్గంపేటలో సాగు నీరు లేక పంటలు ఎండిపోయి కరువుతో రైతులు అల్లాడుపోతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో మధు మాట్లాడుతూ జిల్లాలో వర్షాభావంతో తీవ్ర కరువ పరిస్థితిని ఎదుర్కొంటున్న మండలాలన్నింటినీ కరువు ప్రాంతాలుగా ప్రకటించి యుద్ధప్రాతిపదికన సహాయ చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 20 జిల్లాల్లో సుమారు 470 మండలాల్లో ఈ సంవత్సరం తక్కువ వర్షపాతం నమోదై తీవ్ర కరువు పరిస్థితులు నెలకొంటున్నట్లు కనిపిస్తున్నాయిని చెప్పారు. వర్షాభావంతో దెబ్బతిన్న ఆహార పంటలకు ఎకరాకు రూ.50 వేలు, వాణిజ్య పంటలకు రూ.75 వేలు, ఉద్యాన పంటలకు రూ.లక్ష నష్టపరిహారం అందించాలని కోరారు. ఈ ధర్నాలో కె.బోడకొండ, తోకల ప్రసాద్, పి.సత్యనారాయణ, పప్పు ఆదినారాయణ, రామారావు, సత్య, సుబ్బమ్మ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు ప్రత్తిపాటి, ఎంఎల్ఎ గోరంట్ల

రానున్నది టిడిపి, జనసేన ప్రభుత్వమే

ప్రజాశక్తి-కాకినాడ

రాష్ట్రంలో రానున్నది టిడిపి, జనసేన పార్టీల ప్రభుత్వమేనని టిడిపి మాజీ మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి వెల్లడించారు. శుక్రవారం కాకినాడలోని టిడిపి జిల్లా కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. యువగళం పాదయాత్ర 27వ తేదీ ఉదయం పది గంటల నుంచి పొదలాడలో ప్రారంభం అవుతుందని అదే రోజు సాయంత్రం తాటిపాకలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో సిఎం జగన్ ఆధ్వర్యంలో మాఫియా పాలన నడుస్తోందన్నారు. ఆయన నివాసం ఉంటున్న తాడేపల్లికి రూ.50 కోట్ల మద్యం, ఇసుక ఇతర రంగాలకు చెందిన అక్రమ సొమ్ము వెళుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తోందన్నారు. 14 ఏళ్ల పాటు రాష్ట్రానికి సిఎంగా పనిచేసిన చంద్రబాబును అక్రమంగా జైల్లో పెట్టించి జగన్ నవ్వుల పాలయ్యారన్నారు. ఇప్పటి వరకు కోర్టులకు సరైన ఆధారాలను సమర్పించలేదన్నారు. త్వరలో వైసిపి ప్రభుత్వం పోతుందని, రాష్ట్రంలో టిడిపి, జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడుతుందని చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్, నాయకులు వనమాడి వెంకటేశ్వరరావు, చిక్కాల రామచంద్రరావు, వరుపుల సత్యప్రభ, పిల్లి అనంతలక్ష్మి, మల్లిపూడి వీరు, మోకా ఆనంద్ సాగర్, తుమ్మల రమేష్, ఒమ్మి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందుకుంటున్న ఆదిత్య విద్యార్థులు

వ్యాసరచనలో ఆదిత్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కాకినాడ

సత్య సాయి సేవా సంస్థ విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ఆదిత్య విద్యార్థులు చక్కని ప్రతిభ కనపరిచారని ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు తెలిపారు. విద్యలో మానవత, నైతిక విలువలు పెంపొందించాలనే ఉద్దేశంతో సత్యసాయి సేవా సంస్థలు 'మానవత్వమును పెంపొందించే విద్యావశ్యకత' అనే అంశంపై విద్యార్థులకు గత నెలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. తెలుగు, ఆంగ్ల మాధ్యమంలో జరిగిన ఈ పోటీల్లో ఆదిత్య విద్యార్థులు ఎం.ఆదిలక్ష్మి ప్రథమ, కె.శ్రీదుర్గ తృతీయ స్థానాల్లో నిలిచారు. విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు, సత్యసాయి సేవా సంస్థలు స్టేట్ ఫ్యాకల్టీ డాక్టర్ డిఎస్‌డి.శ్యామల, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, క్యాంపస్ ఇన్చార్జ్ మూర్తి, ఎన్ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ తేజేశ్వరరావు, దివాకరరావు అధ్యాపకులు అభినందించారు.

యానాం వార్తలు

కనకాలపేట వరకు బస్సు వేయాలని వినతి

ప్రజాశక్తి - యానాం

యానాం పిఆర్‌టిసి బస్సును కనకాలపేట వరకు నడపాలని కనకాలపేట యూత్ సభ్యులు పరిపాలనాధికారి మునిస్వామికి శుక్రవారం వినతిపత్రం అందించారు. కనకాలపేట నుండి ప్రజలు ప్రభుత్వ ఆఫీసులకు, హాస్పిటల్స్, కూలి పనులకు వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారని అధికారులు స్పందించి కనకాలపేట వరకు బస్సు నడపాలని కోరారు. ఈ బస్సు కనకాల పేట నుండి సావిత్రి నగర్ వరకు నడపవలసి ఉండగా కేవలం యానాం సావిత్రి నగర్ మాత్రమే నడుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కనకాలపేట యూత్ ప్రెసిడెంట్ కోన ఆదినారాయణ, కర్రేడి ప్రసాద్, కోన వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - యానాం

యానాం శివారు సావిత్రి నగర్‌లో మద్యం స్వాధీనం చేసుకునట్టు ఎస్ఐ శేరు నూకరాజు తెలిపారు. సావిత్రి నగర్‌లో అరదాడి వీరేష్‌కు సంబంధించిన రూ.40 వేలు విలువ చేసే మద్యాన్ని మద్యాన్ని పెమ్మాడి నూకరత్నం ఇంట్లో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బీర్ బాటిల్స్ 13 కేసులు, ఐదు కేసులు లిక్కర్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.



శంకుస్థాపన చేస్తున్న దొరబాబు

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కృషి

ప్రజాశక్తి - పెద్దాపురం

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. రాయభూపాలపట్నంలో శుక్రవారం ఆయన వాటర్ ట్యాంక్ నిర్మాణానికి, సిమెంట్ డ్రైన్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి నిధులు కేటాయిస్తున్నారన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నాయన్నారు. ఈ పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ముత్యాల రాజబ్బాయి, పిఎసిఎస్ చైర్మన్ నల్లల నాగేంద్రబాబు, జెడ్‌పిటిసి గవరసాన సూరిబాబు, ఎంపిపి పెంకే సత్యవతి, సర్పంచ్ చీకట్ల లక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, పుట్టా వెంకటరావు, చీకట్ల సత్తిబాబు పాల్గొన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలో శృంగార వల్లభ స్వామి ఆలయంలో రూ.30 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న అన్నదాన భవన నిర్మాణానికి సైరస్ ఇండస్ట్రీస్ అధినేత బండా వెంకట కష్టారావు, పద్మావతి దంపతులు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు దవులూరి సుబ్బారావు, ఆలయ కార్యనిర్వహణాధికారి పులి నారాయణమూర్తి, ఆలయ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ధర్మకర్తలు కుంచే వెంకటరమణ, అడబాల జగ్గారావు, అడబాల శివ, అర్చకులు పెద్దింటి నారాయణచార్యులు, పురుషోత్తమాచార్యులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సిడిపిఒ ఉషకు సమ్మె నోటీసు అందజేస్తున్న అంగన్‌వాడీలు

సిడిపిఒకు అంగన్‌వాడీల సమ్మె నోటీసు

ప్రజాశక్తి - పెద్దాపురం

సమస్యల పరిష్కారం కోరుతూ డిసెంబర్ 8 నుంచి నిరవధిక సమ్మెకు వెళుతున్నట్టు శుక్రవారం ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో శుక్రవారం ఐసిడిఎస్ సిడిపిఒ జి.ఉషకు సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం కాలే దేవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో తలారి నాగమణి మాట్లాడుతూ తెలంగాణ కంటే ఎక్కువ వేతనం ఇస్తామన్న హామీని ప్రభుత్వం నిలబెట్టుకోలేదన్నారు. అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి కృషి చేయటం మానేసి అంగన్వాడీలపై నిర్బంధాన్ని ప్రయోగిస్తోందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు గ్రాడ్యుటి అమలు చేయాలన్నారు. అంగన్వాడీలు చేపట్టబోయే సమ్మెకు ప్రజలందరూ మద్దతు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు సిరపరపు శ్రీనివాస్, నీలపాల సూరిబాబు, టిఎల్.పద్మావతి, జ్యోతి, తులసి, లక్ష్మి, రమణమ్మ పాల్గొన్నారు.

మారేడుబాకలో 'బాబు ష్యూరిటీ'

ప్రజాశక్తి-మండపేట

మండలంలోని మారేడుబాక గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు ఇంటింటికీ పర్యటించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ వైసిపి పాలనలో ఉపాధిలేక యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. టిడిపి ధినేత చంద్రబాబుతోనే యువత భవిష్యత్తుకు గ్యారెంటీ లభిస్తుందన్నారు. టిడిపి, జనసేన ప్రభుత్వం అధికారంలోకొస్తే అన్ని వర్గాలకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



దాళ్వా సాగుపై రైతులకు ఆటో మైక్ ద్వారా ప్రచారం చేపడుతున్న దృశ్యం

దాళ్వా సాగు త్వరగా చేపట్టాలని ప్రచారం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

మార్చి 31వ తేదీ నాటికి గోదావరి కాల్వలు మూతపడనున్న దృష్ట్యా మండల పరిధిలో రైతులు దాళ్వా పంట సాగు సత్వరమే చేపట్టాలని కోరుతూ గ్రామాల్లో శుక్రవారం ఆటో ద్వారా ప్రచారం చేపట్టారు. రైతులు సత్వరమే జాప్యం లేకుండా దాళ్వా సాగుకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.

మండలంలోని వివిధ గ్రామాల్లో వ్యవసాయ శాఖ, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్తంగా ఈ ప్రచారం చేపట్టారు. గోదావరి కాల్వలు మార్చి31 తేదీ నాటికి నిలిపివేస్తారని, కావున బొండాలు రకం వారి సాగును డిసెంబర్ మొదటి వారం లోపు వెదజల్లు, చివరి వారం లోపు ఉడ్పు చేసుకోవాని, లేని పక్షంలో ఎంటియు 1121, ఎంటియు 1153 రకాలను వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒలు వెంకట సతీష్, శాంతి కమల, రిలయన్స్ నాగేశ్వరరావు రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బేడ, బుడగ జంగాలను ఎస్‌సిలుగా గుర్తించాలి

కలెక్టర్ కు వినతి

ప్రజాశక్తి-అమలాపురం

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కుల గణన జనాభా లెక్కల్లో బేడ, బుడగ జంగాలని ఎస్‌లుగా గుర్తించి కుల ధ్రువీకరణ పత్రాలు అందించాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న బేడ,బుడగ జంగాలు, దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ హిమాన్షు శుక్లా ను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా బుడగ జంగాల జిల్లా అధ్యక్షులు పేర్ల దుర్గాప్రసాద్ తమకు ప్రభుత్వం ఎస్సీలుగా గుర్తించి కుల ధృవీకరణ పత్రాలు అందించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొం టున్నా మన్నారు. తమకు కుల ధ్రువీకరణ లేదనే నెపంతో సంక్షేమ పథకాలు అందించడం లేదని వాపోయారు తమ పిల్లలు చదువుకునే సందర్భంలో కుల ధృవీకరణాలు పత్రాలు లేకపోవడం వల్ల చదువు మధ్యలోనే ఆగిపోతున్నాయని వివరించారు తమ బిడ్డలకు సైతం సంక్షేమ పథకాలు అందడం లేదని తెలిపారు సమాజంలో ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా వెనకబడి అనేక రకాల వివక్షను ఎదుర్కొంటున్న మేము గత 15 సంవత్సరాలు పైగా కుల ధృవీకరణ పత్రాలు లేకుండానే జీవిస్తున్నామని దీనిపై అనేక సందర్భాలలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా ఇప్పటివరకు అందించలేదన్నారు. వీరికి మద్దతుగా మాజీ ఎంఎల్ఎ మానేపల్లి అయ్యోజీవేమ, దళిత ప్రజాసంఘాల నాయకులు ఇసుక పట్ల రఘుబాబు, రేవు తిరుపతిరావు, బిజెపి జిల్లా అధ్యక్షులు దొరబాబు తదితరులు కలెక్టర్ కలిసి వేడ బుడగజంగాలు పడుతున్న ఇబ్బందులను వివరించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. జిల్లా కలెక్టర్ స్పందిస్తూ జరుగుతున్న కుల గణన జనాభా లెక్కల్లో వెబ్ ఆప్షన్ లో బేడ బుడగ జంగాలను చేరుస్తామని, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సూచించిన వెంటనే ఎస్‌సి కుల ధ్రువీకరణ పత్రాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బేడ బుడగ జంగంజిల్లా ఉపాధ్యక్షులు, ముగ్గు నాగేశ్వరరావు, జిల్లా గౌరవ అధ్యక్షులు, ముగ్గు పెద్దిరాజు, కళ్యాణ్ దుర్గం రాజు తదితరులు పాల్గొన్నారు..



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

గైనకాలజిస్ట్ సత్యవతి మృతికి సంతాపం

ప్రజాశక్తి-మండపేట

గైనకాలజిస్ట్, సమాజ సేవకి డాక్టర్ పాలడుగు సత్యవతి (87) బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఈమె మృతికి ప్రముఖులు సంతాపం తెలిపారు. 1960లో నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ పాలడుగు చంద్రమౌళితో వివాహం కాగా 1962 నుండి మండపేట పట్టణంలో వైద్య సేవలు ప్రారంభించారు. 1967 – 68లో అత్యధిక కుటుంబ ఆపరేషన్లు చేసినందుకు గాను ఆమె ముఖ్యమంత్రి అవార్డు అందుకున్నారు. 1979లో స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో జెడ్‌పి బాలికోన్నత పాఠశాలను సొంత నిధులతో నిర్మించడంతో దానికి డాక్టర్ పాలడుగు చంద్రమౌళి సత్యవతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా నామకరణం చేశారు. 1981లో కౌన్సిలర్‌గా నెగ్గి రాజకీయంగాను సేవలందించారు. ఈమెకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈమె మృతికి ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు, ప్రముఖులు సంతాపం తెలిపారు. సత్యవతి అంత్యక్రియలు ఆదివారం జరుగుతాయని డాక్టర్ చంద్రమౌళి తెలిపారు.



డాక్టర్ సత్యవతి(ఫైల్ ఫోటో)

'వికసిత్ భారత్' విజయవంతానికి పిలుపు

ప్రజాశక్తి-అమలాపురం

వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని సమర్థవంతంగా చక్కటి ప్రణాళిక సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని కేంద్ర ఆర్థిక సంఘ సంచాలకులు శోభిత్ గుప్తా జిల్లా స్థాయి అధికారులను కోరారు. శుక్ర వారం స్థానిక కలెక్టరేట్లో జిల్లాస్థాయి అధికారులకు వికసిత్ భారత సంకల్పయాత్ర కార్యక్రమాల నిర్వహణ తీరు పట్ల అవగాహన కల్పించాలన్నారు. ఆయన మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, గరీబ్ యోజన, దీన దయాల్ అంత్యోదయ యోజన, జాతీయ గ్రామీణ కార్యక్రమాలు పీఎం ఉజ్వల యోజన, పిఎం కిసాన్, జలజీవన్ మిషన్, అటల్ పెన్షన్ యోజన, జన్ ధన్ యోజన వంటి 17 రకాల కార్యక్రమాలపై జిల్లాకు కేటాయించిన మూడు వాహనాల ద్వారా కార్యక్రమాల నిర్వహణకై కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు. ఈ వాహనాలకు జియో ట్యాగింగ్ ఉంటుందని వాహనాల ద్వారా ప్రచార సామాగ్రి కరపత్రాలు తోపాటు ప్రధానమంత్రి మెసేజి వీడియో ద్వారా ప్రదర్శించడం జరుగుతుందన్నారు. వేదికలను రైతులు ఎక్కువగా ఉన్నచోట్ల ఎంపిక చేసి రైతు వారి కార్యక్రమాలు ఫోకస్ చేస్తూ స్ఫూర్తిదాయకమైన చైతన్యాన్ని ప్రజల్లో తీసుకుని రావడంతో పాటుగా వాలంటీర్ వ్యవస్థ ద్వారా వివిధ పథకాలు ఇంకా పొందకుండా మిగిలి ఉన్న లబ్ధిదారులను నమోదు చేసే ప్రక్రియ చేపట్టి లబ్ధిని చేకూర్చాలని సూచించారు. అదేవిధంగా రోజువారి గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల స్పందనను నోడల్ అధికారి యాప్ లో డేటా ఎంట్రీ చేసి నివేదిక సమర్పించాలన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర పేరూరు గ్రామం నుండి శుక్రవారం ఆరంభమైందన్నారు. ముందుగా వాహనం ద్వారా గ్రామాలలో 17 పథకాల అమలు విధి విధానాలు పట్ల అవగాహన పెంపొందించే విధంగా స్ఫూర్తిదాయకమైన ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తూ మరో వైపు మారుమూల గ్రామాల సైతం పథకాల లబ్ధిని పొందకుండా మిగిలి ఉన్న వారిని నమోదు చేసి లబ్ధిని పొందే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. జిల్లాస్థాయిలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి కమిటీ, జిల్లాస్థాయి నోడల్ అధికారిగా జిల్లా పంచాయతీ అధికారి, మండల స్థాయిలో నోడల్ అధికారిగా ఎంపిడిఒ, స్వాగత్, ఉత్సవ కమిటీలు, పంచాయతీ కార్యదర్శులు సర్పంచులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలన్నారు.. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహణపై మండలంలో వివిధ శాఖల అధికారులు, సచివాలయాల వాలంటీర్లతో సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి వి.కృష్ణకుమారి మాట్లాడుతూ కేంద్ర సంక్షేమ పథకాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమ ంలో పంచాయతీరాజ్ ఆర్ డబ్ల్యూఎస్ ఎస్‌సిలు కె.చంటిబాబు సిహెచ్ ఎన్‌వి.కృష్ణారెడ్డి, డి ఆర్ డి ఏ పి డి వి శివశంకర్ ప్రసాద్ పశు సంవర్ధక శాఖ జేడి కే వెంకట్రావు వివిధ శాఖలకు చెందిన జిల్లాస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.